క్లుప్తంగా

కుష్టువ్యాధిపై అవగాహన

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు పీహెచ్‌సీ పరిధిలోని గోవిందాయపల్లె ఉన్నత పాఠశాలలో సోమవారం వైద్యాధికారి డాక్టర్‌ వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చేతిలో నుంచి వస్తువులు పడిపోవడం, కాళ్లలో నుంచి చెప్పులు జారిపోవడం, ముక్కుదిబ్బడ, కంటి నరాలు దెబ్బతిని కంటిచూపు కోల్పోవడం, అరచేతిలో వేడి, చల్లని వస్తువులను తాకినపుడు స్పర్శ తెలియకపోవడం తదితర లక్షణాలు ఉంటే వైద్యాధికారిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పుల్లయ్య, హెల్త్‌ సూపర్‌వైజర్‌ జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఏఎన్‌ఎంలు కుమారి, మల్లిక, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

చాపాడు : సేవా కార్యక్రమాలకు సహకరించడం అభినందనీయమని నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు అన్నారు. విద్యాశాఖ ప్రవేశపెట్టిన శుభదిన్‌ కార్యక్రమంలో భాగంగా సోమవారం నక్కలదిన్నె ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు తిథి భోజనం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన నాగభూషన్‌రెడ్డి, అనిత కుమార్తె ఆరాధ్య పుట్టిన రోజు సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు భోజన వసతిని కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలోఉపాధ్యాయులు కృష్ణయ్య, రాధమ్మ పాల్గొన్నారు.

అతిథి భోజనం

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని పలు పాఠశాలల్లో సోమవారం అతిథి భోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. శెట్టివారిపల్లె జెడ్పీ హైస్కూల్‌లో గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి సహకారంతో 500 మంది విద్యార్థులకు హెడ్మాస్టర్‌, ఉపాధ్యాయులు అతిథి భోజనాన్ని అందించారు. వెంకటాపురం ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులకు తీట్ల విజయ్‌ సహకారంతో, పట్టణంలోని బాలశివ బాలికల హైస్కూల్‌లో బీజేపీ నియోజకవర్గ అధ్యక్షుడు, లక్ష్మీ ఎలైట్‌ పార్క్‌ అధినేత మాచనూరు సుబ్బరాయుడు సహకారంతో 100 మంది విద్యార్థులకు అతిథి భోజనాన్ని వడ్డించారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : మండలానికి 25 గోకులం షెడ్‌లు మంజూరయ్యాయని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి మహమ్మద్‌ గౌస్‌ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పశువుల షెడ్‌కు రూ.1.15లక్షలు, నాలుగు పశువుల షెడ్‌కు రూ.1.85 లక్షలు, ఆరు పశువుల షెడ్‌కు రూ.2.30 లక్షలు మంజూరవుతుందన్నారు. రైతు వాటా 10శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. గొర్రెలు, మేకల షెడ్డులకు సంబంధించి ప్రభుత్వం ప్రభుత్వం 70 శాతం సబ్సిడీ ప్రభుత్వం మంజూరు చేస్తుందని మిగిలిన 30 శాతం రైతులు చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులు అప్లికేషన్‌తో పాటు ఆధార్‌, ఉపాధి జాబ్‌కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, తహసీల్దారు మంజూరు చేసిన స్థల ధ్రువ పత్రం, రేషన్‌ కార్డు, ఫొటోతో పశు వైద్యశాలల్లో సంప్రదించాలని తెలిపారు.

దివ్యాంగులను ఆదుకోవాలి

బి.కోడూరు : మండలంలోని దివ్యాంగులను ఆదుకోవాలని దివ్యాంగుల హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ఓబులేసు కోరారు. సోమవారం మండల కేంద్రమైన బి.కోడూరులో దివ్యాంగుల హక్కుల కోసం తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దారు మధుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ఇంటి స్థలాలను మంజూరు చేసి పక్కా భవనాలను కట్టించి ఇవ్వాలని డిమాండ్‌ చేశారు. అంతేకాకుండా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా అధ్యక్షుడు జి.బాలరాజు, కోశాధికారి బి.మునీంద్ర, గౌరవ సలహాదారులు మురళి, బి.కోడూరు మండల కన్వీనర్‌ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ప్రవచనాలు

ప్రొద్దుటూరు : స్థానిక శివదర్శనానంద స్పిరిచ్యువల్‌ ట్రస్టు ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు నిర్వాహకులు పూజ్యస్వామినీ శివదర్శనానంద సరస్వతి మాతాజీ తెలిపారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి శని, ఆదివారాల్లో ఉదయం 6 నుంచి 7 గంటల వరకు (పురుషులకు), 7 నుంచి 8 గంటల వరకు (పిల్లలకు), సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు (మహిళలకు) యోగా, మెడిటేషన్‌ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు శివదర్శనానంద భజనలు, సంగీతం, పారాయణం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. సోమ, మంగళ, బుధవారాల్లో రాత్రి 8 నుంచి 9 గంటల వరకు ఆన్‌లైన్‌ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి 12 గంటల వరకు బాల సత్సంగం, సోమ, మంగళ, బుధవారాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు శివదర్శనానంద కోలాట బృందం కార్యక్రమాలు, గురు, శుక్ర, శనివారాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4 గంటల వరకు ఆర్ట్స్‌, క్రాఫ్ట్‌ కార్యక్రమాలతోపాటు, భక్తులు కోరిన రోజున ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు ఇంటింటా పారాయణం, భజన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనడానికి ఆసక్తి గల వారు 7075883536 సెల్‌ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

వరుస హత్యలతో కలకలం

- చిన్నపాటి కారణాలకే నేలకొరుగుతున్న ప్రాణాలు
- 38 రోజుల్లోనే 4 హత్యలు
- అభద్రతా భావంలో ప్రజలు



మృతి చెందిన అర్షద్‌ (ఫైల్‌)



బాలనాగమ్మ మృతదేహం(ఫైల్‌)

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. రోజుల వ్యవధిలోనే ఎక్కడో ఒక చోట హత్యోదంతాలు జరుగుతూనే ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం ఫ్యాక్షన్‌ గొడవల కారణంగానో.. రాజకీయ ప్రతీకార దాడుల వల్లనో ఎప్పుడో ఒక సారి హత్యలు జరిగేవి. ఒక హత్య జరిగిందంటే అప్పట్లో అది సంచలనం. హత్య ఘటన గురించి కొన్ని నెలల పాటు చర్చించుకునేవారు. అయితే ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఏ కారణం లేకుండానే ఒకరికొకరు చంపుకొంటున్నారు. క్షణికావేశంలో చిన్నపాటి కారణాలకే నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. వాణిజ్య కేంద్రమైన ప్రొద్దుటూరులో ఇటీవల జరిగిన వరుస హత్యలే ఇందుకు ఉదాహరణ. ఈ హత్యలు మనిషి ఆలోచనా విధానానికి అద్దం పడుతున్నాయి. టెక్నాలజీ అభివృద్ధి చెంది దేశం అన్ని రంగాల్లో పరుగులు పెడుతున్న తరుణంలో మనిషి విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతున్నాడనడానికి ఈ సంఘటనలే నిదర్శనం. కొన్ని రోజులుగా జరుగుతున్న వరుస హత్యలు ప్రొద్దుటూరులో అలజడి సృష్టిస్తున్నాయి. ఈ ఘటనలతో ఇక్కడి ప్రజల్లో అభద్రతా భావం నెలకొంది.

38 రోజుల్లో 4 హత్యలు

ప్రొద్దుటూరులో కేవలం 38 రోజుల్లోనే నలుగురు హత్యకు గురయ్యారు. జూన్‌ నెలలో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు, జూలై నెలలో మూడు రోజుల వ్యవధిలో మరో ఇద్దరిని దారుణంగా చంపేశారు. వీరి మధ్య ఉన్న సమస్యలు కూర్చొని మాట్లాడుకుంటే సమసిపోయేవే. కుటుంబ సభ్యుల గురించి కాస్తయినా ఆలోచన చేయకుండా క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాల మూలంగా కుటుంబాలు సర్వనాశనం అవుతున్నాయి. ఈ ఘటనలతో ఏ పాపం ఎరుగని ఎందరో పసి పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి వీధిన పడుతున్నారు.

దూషించాడని బండరాయిని తలపై వేసి..

ప్రొద్దుటూరులోని దర్గాబజార్‌కు చెందిన షేక్‌ అర్షద్‌ (37) ఆటో నడుపుకొని జీవనం సాగించేవాడు. అతనికి రామేశ్వరం రోడ్డులోని సోమా వెంకటసుబ్బయ్యతో పరిచయం ఉండేది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను అర్షద్‌ అసభ్య పదజాలంతో దూషించాడు. అప్పటి నుంచి అతనిపై వెంకటసుబ్బయ్య కోపంతో రగిలిపోయేవాడు. ఈ క్రమంలో జూన్‌ 21న రాత్రి అర్షద్‌ మద్యం సేవించి రామేశ్వరం రోడ్డులోని వైన్‌ షాపు వద్ద దారి పక్కన పడుకొని ఉన్నాడు. అదే దారిలో వెళ్తున్న వెంకటసుబ్బయ్య పక్కనే ఉన్న బండరాయి తీసుకొని అతని తలపై వేయగా అక్కడిక్కడే మృతి చెందాడు.

తనను చంపుతాడనే భయంతో హత్య చేశాడు

వైఎంఆర్‌ కాలనీలో జూన్‌ 24న మహేశ్వరరెడ్డి (31)ని రామచంద్రారెడ్డి అనే స్వీట్స్‌ వ్యాపారి హత్య చేశాడు. అతని మృతదేహాన్ని అత్యంత కర్కషంగా మూడు ముక్కలుగా నరికాడు. మహేశ్వరరెడ్డి తల్లి నాగరత్నమ్మతో రామచంద్రారెడ్డి 18 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. దీంతో ముగ్గురూ కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. మహేశ్వరరెడ్డి వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళతో రామచంద్రారెడ్డి చనువుగా ఉండేవాడు. ఈ విషయమై పలు మార్లు అతన్ని మహేశ్వరరెడ్డి దండించాడు. అంతేగాక రామచంద్రారెడ్డికి నాగరత్నమ్మ రూ.3 లక్షలు డబ్బు ఇచ్చింది. ఈ డబ్బు ఇస్తే తాము ఎక్కడికైనా వెళ్లి జీవిస్తామని ఆమె అనేక సార్లు అడిగినా ఇవ్వలేదు. ఈ విషయమై రామచంద్రారెడ్డి, మహేశ్వరరెడ్డిలు 23న రాత్రి గొడవ పడ్డారు. బయటికి వెళ్లొచ్చిన తర్వాత నీ అంతు చూస్తానంటూ రామచంద్రారెడ్డిని అతను బెదిరించి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఇంటికి ఇచ్చిన మహేశ్వరరెడ్డి మద్యం మత్తులో పడుకున్నాడు. అతను నిద్రలేస్తే చంపేస్తాడేమోననే భయం రామచంద్రారెడ్డిలో ఉండేది. ఈ క్రమంలో నిద్రపోతున్న మహేశ్వరరెడ్డిని 24వ తేదీ వేకువజామున గొడ్డలితో హత్య చేశాడు. మృతదేహాన్ని మూడు ముక్కలుగా నరికి పట్టణ శివారులోని ముళ్లపొదల్లో పడేశాడు.

విడాకులు ఇవ్వలేదని భార్యను హతమార్చి..

ప్రొద్దుటూరులోని అమృతానగర్‌కు చెందిన అన్వర్‌బాషా మైలవరం మండలంలోని దొడియం గ్రామానికి చెందిన రేష్మా (25)లు 10 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అన్వర్‌బాషా జేసీబీ డ్రైవర్‌గా వెళ్లేవాడు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మరో వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని అన్వర్‌బాషా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తనకు విడాకులు ఇస్తే మరో పెళ్లి చేసుకుంటానని భార్య రేష్మాను అడుగుతున్నా అందుకు ఆమె అంగీకరించలేదు. ఈ విషయమై భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరిగేది. కొన్ని రోజుల క్రితం రేష్మా భర్తతో గొడవ పడి పట్టణంలోని ఈశ్వరరెడ్డినగర్‌లో ఉంటున్న తన పెద్దమ్మ వద్దకు వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఈ నెల 12న అతను ఈశ్వరరెడ్డినగర్‌కు వెళ్లి పార్కుకు వెళ్దాం రా అంటూ భార్యను పిలిచాడు. భర్త ప్రేమతో పిలుస్తున్నాడని భావించిన రేష్మా బైక్‌లో అతని వెంట వెళ్లిపోయింది. మాయ మాటలు చెప్పిన అన్వర్‌బాషా భార్య రేష్మాను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. అంతటితో ఆగక గొయ్యి తీసి ఆమె మృతదేహాన్ని పాతిపెట్టాడు. అన్వర్‌బాషా స్టేషన్‌కు వెళ్లి భార్యను హత్య చేసినట్లు పోలీసులకు తెలిపాడు.

వియ్యపురాలినే చంపేశాడు

తన ఇష్టానికి వ్యతిరేకంగా తన కుమార్తె పెళ్లిని దగ్గరుండి జరిపించిందనే కోపంతో వియ్యపురాలినే హత్య చేశాడు. ప్రొద్దుటూరులోని నేతాజీనగర్‌లో ఈ నెల 15న బాలనాగమ్మ (68) అనే వృద్ధురాలిని ఆమె వియ్యంకుడు జయచంద్రుడు పెట్రోల్‌ పోసి నిప్పంటించగా అక్కడిక్కడే మృతి చెందింది. సీకే దిన్నె మండలంలోని ఊటుకూరుకు చెందిన జయచంద్రుడు కుమార్తె ఉష నాగమనీషా, ప్రొద్దుటూరులోని బాలనాగమ్మ కుమారుడు సురేష్‌లు ప్రేమించుకుని నాలుగు నెలల క్రితం చాపాడు మండలంలోని అల్లాడుపల్లె ఆలయాల వద్ద పెళ్లి చేసుకున్నారు. ఉష నాగమనీషా తండ్రికి ఈ పెళ్లి ఇష్టం లేదు. తనకు ఇష్టం లేని కుమార్తె పెళ్లిని వియ్యపురాలు బాలనాగమ్మ దగ్గరుండి జరిపించిందని ఆమెపై వియ్యంకుడైన జయచంద్రుడు కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో బాలనాగమ్మ ఇంట్లో ఉండగా జూలై 15న జయచంద్రుడు అక్కడికి వెళ్లి ఆమెపై పెట్రోల్‌ పోసి నిప్పంటించాడు. మంటల్లో తీవ్ర ఆర్తనాదాలు పెట్టిన ఆమె కొద్ది సేపటి తర్వాత మృతి చెందింది. కొన్ని రోజుల వ్యవధిలో వరుసగా జరిగిన ఈ హత్యలు పట్టణంలో తీవ్ర అలజడిని సృష్టించాయి. ఎప్పుడు ఏం జరుగుతుందనే భయాందోళనలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి.

క్షణికావేశాలకు లోను కావద్దు



క్షణికావేశం అనేక అనర్థాలకు దారి తీస్తుంది. కుటుంబ సమస్యలతో సతమతమవుతూ హత్యలు చేసుకునే వరకు వెళ్తున్నారు. చావడమో, చంపడమో సమస్యలకు పరిష్కారం కాదు. ప్రశాంతంగా ఆలోచిస్తే ప్రతి సమస్యకూ పరిష్కారం దొరుకుతుంది. ప్రాణం ఎంతో విలువైంది. మనిషి ఆలోచనా విధానంలో మార్పు రావాలి. ఏదైనా సమస్య వస్తే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలి. ఎవరికి వారు సొంత నిర్ణయాలు తీసుకొని సమస్యల్లో చిక్కుకోవద్దు.

– మురళీధర్‌, డీఎస్పీ, ప్రొద్దుటూరు

ప్రజలను మభ్య పెట్టేందుకే ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌

- ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ



బద్వేలు అర్బన్‌ : ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను దగా చేసేందుకే సీఎం చంద్రబాబు ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌కు వెళ్లారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్‌ సుధ విమర్శించారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్‌ ప్రవేశపెట్టకుండా ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌కు వెళ్లడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్‌ ప్రవేశపెడితే ఆదాయాలు, ఖర్చులు, రుణాల మొత్తం ఎంత అని వివరించడంతో పాటు ఏపీ శాఖలకు, ఏపీ పథకాలకు ఎంత ఖర్చు పెడుతున్నారో వంటి వివరాలు చెప్పాల్సి వస్తుందని, అందుకే పూర్తిస్థాయి బడ్జెట్‌ ప్రవేశపెట్టకుండా ఓటాన్‌ అకౌంట్‌ బడ్జెట్‌కు వెళ్లిందని తెలిపారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసే రెండు రోజుల ముందు కేంద్రం నుంచి రాష్ట్రానికి డివల్యూషన్‌ రూపంలో రావాల్సిన రూ.5,655 కోట్లు విడుదల చేశారని తెలిపారు. మొత్తంగా రూ.7 నుంచి 8 వేల కోట్లు అందుబాటులో ఉన్నప్పటికీ పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం లేదని, ఇందుకు కారణం వాగ్దానాల నుంచి తప్పించుకుని ప్రజలను మోసగించే పన్నాగమే అని అన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో 2019లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఖజానాలో కేవలం వంద కోట్లు మాత్రమే ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో బడ్జెట్‌ ప్రవేశపెట్టి పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేశారని గుర్తుచేశారు.

రెడ్‌బుక్‌ రాజ్యాంగం అమలు

ప్రజలెవరూ ప్రశ్నించకూడదన్న ఉద్దేశ్యంతో పాటు ప్రజల దృష్టిని మరల్చేందుకు రెడ్‌బుక్‌ రాజ్యాంగాన్ని నడుపుతూ అణిచివేతకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌ అంటే అరాచకం, ఆంధ్రప్రదేశ్‌ అంటే ఆటవిక పాలన అనే బ్రాండ్‌ దేశం మొత్తం వినిపిస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన సూపర్‌సిక్స్‌ హామీలకు ప్రజలు ఆకర్షితులై ఆయనను గెలిపిస్తే ఆ హామీలను అమలుపరచకుండా సాకులు చెప్పడం తగదన్నారు. అంతేకాకుండా హామీలను అమలు చేయలేక గత ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని, రాష్ట్రం ఆర్థికంగా ధ్వంసమైందని కల్లబొల్లి మాటలు చెప్పడం తగదని హితవుపలికారు. ఇప్పటికైనా ప్రజల ఆకాంక్షల మేరకు పాలన సాగించి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వరిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఉప్పత్తివారిపల్లెలో కూలీలతోపాటు నారుమడిలో పని చేస్తున్న ఏడీఏ నాగరాజ

గోపవరం : వరిపంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండలంలోని అగ్రహారం, గోపవరం మండలంలోని ఉప్పత్తివారిపల్లెలో వరినాళ్లు, నాట్లను స్థానిక వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. వరిపంట సాగులో యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నారు పెరికే సమయంలో కొసలు తుంచివేసి నాట్లు వేసుకోవాలన్నారు. అలాగే కాలిబాటలు తీయడం వలన చాలా ప్రయోజనాలు ఉంటాయని, పంటలో గాలి వ్యాపించేందుకు, ఎరువులు వేసుకునేందుకు, మందులు పిచికారీ చేసేందుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. దిగుబడి కూడా అదే స్థాయిలో ఉంటుందని తెలిపారు. వీలైనంత వరకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. అనంతరం కాలువపల్లెలో పొలంబడి నిర్వహించి ఖరీఫ్‌ సీజన్‌లో సాగు చేసే పంటలు తదితర వివరాలను రైతుల నుంచి సేకరించి సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పులుల ప్రాధాన్యతపై అవగాహన



పులుల ప్రాధాన్యత వివరిస్తున్న అధికారి రఘునాథరెడ్డి

పోరుమామిళ్ల: ప్రపంచ పులుల దినోత్సవ సందర్భంగా సోమవారం స్థానిక కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాలలో పోరుమామిళ్ల రేంజి అటవీశాఖ అధికారి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు పులుల ప్రాధాన్యత, ఆవశ్యకతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అడవిలో పులికి ఉన్న ప్రాముఖ్యత వల్లనే దాన్ని జాతీయ జంతువుగా ప్రభుత్వం గుర్తించిందని రేంజర్‌ వివరించారు. అడవిలో క్రూరమృగాలు లేకపోతే అడవులు అంతరించి పోయే ప్రమాదముందన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో సెక్షన్‌ ఆఫీసర్‌ శ్రీరమణ, బీటు అధికారులు కరుణాకర్‌, కిషోర్‌, ప్రతాప్‌, కస్తూర్బా ప్రత్యేకాధికారిణి నాగమల్లేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించాలి



జూనియర్‌ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పీఆర్‌ఎస్‌వైఎఫ్‌ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : జూనియర్‌ కళాశాలల విద్యార్థులకు కూడా గతంలో వలే మధ్యాహ్నాభోజనం పునఃప్రారంభించాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్‌ నాగేంద్రబాబు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. సోమవారం ప్రభుత్వ జూనియర్‌ కళాశాల వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్‌ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రవేశ పెట్టడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఇప్పుడు వారు మధ్యాహ్న భోజనం కోసం ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మళ్లీ మధ్యాహ్నభోజనం అమలు చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌ఎస్‌వైఎఫ్‌ నాయకులు రియాజ్‌, మనోజ్‌, జూనియర్‌ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

31న జాబ్‌మేళా

బద్వేలు అర్బన్‌ : బెంగుళూరుకు చెందిన పలు ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో ఈ నెల 31న రాచపూడినాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో జాబ్‌ఫేర్‌ నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్‌ ఆర్‌.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్‌ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌, సీనియర్‌ అసిస్టెంట్‌, బిల్లింగ్‌ ఆపరేటర్‌ వంటి 500 ఉద్యోగాలకు సంబంధించి నిర్వహించే ఈ జాబ్‌ఫేర్‌కు పది, ఇంటర్‌, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9440740477 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జూదరులకు కౌన్సెలింగ్‌

రాజుపాళెం : రాజుపాళెం పోలీస్‌స్టేషన్‌ ఆవరణలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో గతంలో జూదం ఆడుతూ పట్టుబడిన వారికి ఎస్‌ఐ తులసీనాగప్రసాద్‌ కౌన్సెలింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తమకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామకృష్ణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శివోహం అన్నప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో రెడ్డి సేవా సంఘం, రెడ్ల కల్యాణ మండపం వారు సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శివోహం అన్నప్రసాద సేవా సంఘం అధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, సభ్యులు విష్ణు, నారాయణ, విజయ్‌కుమార్‌, లింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణయ్య పాల్గొన్నారు.

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయాలి



చలో ఢిల్లీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : ఎస్సీ వర్గీకరణ కోరుతూ ఆగస్టు 9న ఎమ్మార్పీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఢిల్లీ మాదిగల మహాధర్నాను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎ.సుధాకర్‌ మాదిగ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌ క్లబ్‌లో సోమవారం చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టి ఏ, బీ, సీ, డీలుగా విభజిస్తామని చెప్పి 10 ఏళ్లు అయినా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగకపోవడం వల్ల మాదిగ, మాదిగ ఉపకులాల వారు విద్యా, ఉద్యోగ, రాజకీయం, సంక్షేమ రంగాల్లో వెనుకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటు సమావేశాలు జరిగినప్పుడల్లా వేలాది మంది మాదిగలు ఢిల్లీలో అనేక రూపాల్లో ఆందోళనలు చేసినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 9న ఢిల్లీలో జంతర్‌మంతర్‌ వద్ద ఏపీ ఎమ్మార్పీస్‌ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రాజేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటమ్మ, నాయకుడు రాజేష్‌ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్‌లు, నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : పట్టణానికి చెందిన హెచ్‌బీ మార్షల్‌ ఆర్ట్స్‌ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయి కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో ప్రతిభ కనపరచి బంగారు పతకాలు సాధించారు. ఇటీవల హైదరాబాదులో బ్రూస్‌లీస్‌ జీత్‌కునెడో స్పోర్ట్స్‌ ఆల్‌ స్టైల్స్‌ మార్షల్‌ ఆర్ట్స్‌ ఫెడరేషన్‌ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి 12వ జాతీయ స్థాయి ఓపన్‌ ఆల్‌స్టైల్స్‌ కుంగ్‌ఫూ కరాటే చాంపియన్‌ షిప్‌ 2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్‌ -14, 17 బాలికల ఫైటింగ్‌ విభాగంలో ఎస్‌.జునైద్‌, ఎస్‌.అబ్దుల్‌ జావిద్‌, టి.నరసింహ, వై.నాగలహరిలు బంగారు పతకాలు సాధించారని మాస్టర్‌ జేకే సోహైల్‌ తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి పట్టణానికి మంచి పేరు తెచ్చిన విద్యార్థులను మాస్టర్‌తోపాటు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

జంప్‌ రోప్‌ పోటీలలో..

చాపాడు : అంతర్‌ జిల్లాల అండర్‌-12, 14 స్థాయి స్థాయి జంప్‌ రోప్‌ పోటీలలో మండలంలోని నరహరిపురంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల విద్యార్థులు గోల్డ్‌ మెడల్‌ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.నరసింహశాస్త్రీ తెలిపారు. నంద్యాలలో శని, ఆదివారాలలో గ్లోబల్‌ పాఠశాలలో జంప్‌ రోప్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో టీం విభాగంలో జ్ఞాన అక్షిత సాయి, కే.శివచందన, మహేష్‌కు గోల్డ్‌ మెడల్‌, ధర్మతేజకు సిల్వర్‌మెడల్‌, వెన్నెలకు బ్రాంచ్‌ మెడల్‌ సాధించారన్నారు. వ్యాయామ ఉపాధ్యాయిని ప్రశాంతి, విద్యార్థులను సోమవారం పాఠశాల సిబ్బంది అభినందించారు.

మాకు కేటాయించిన భూములు మాకే ఇవ్వండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ముంపు బాధితులు

అట్లూరు : ముంపు బాధితులమైన తమకు కేటాయించిన భూములను తమకే ఇవ్వాలని అట్లూరు మండలం మల్లిసేనిపట్నం గ్రామానికి చెందిన నిర్వాసితులు సోమవారం తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో సోమశిల ముంపు బాధితులమైన తమకు అట్లూరు మండల పరిధిలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలంలో భూములు కేటాయించారని, అయితే ఆయా భూములను తమకే కేటాయించాలని తహసీల్దారును కోరారు.

మహిళల రక్షణ కోసమే పోష్‌ చట్టం



ప్రొద్దుటూరు : సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ హైమావతి



మైదుకూరు : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫజుల్‌ రహిమాన్‌

ప్రొద్దుటూరు : ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పని చేస్తున్న మహిళల రక్షణ కోసమే కేంద్ర ప్రభుత్వం పోష్‌ యాక్ట్‌ -2013ను అమలు చేసిందని ఐసీడీఎస్‌ అర్బన్‌ ప్రాజెక్టు సీడీపీఓ హైమావతి తెలిపారు. స్థానిక మున్సిపల్‌ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్‌ కమిషనర్‌ రఘునాథరెడ్డి అధ్యక్షతన పోష్‌ యాక్ట్‌పై మహిళా ఉద్యోగులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలతోపాటు ఇటుకల ఫ్యాక్టరీలు, నర్సింగ్‌ హోంలతో సహా మహిళలు పనిచేసే అన్ని ప్రాంతాల్లో ఈ చట్టం వర్తిస్తుందన్నారు. పది మందికి తక్కువ కాకుండా పనిచేసే ప్రతి పరిశ్రమలో చట్టాన్ని అమలు చేశారన్నారు. పట్టణ ప్రాంతానికి సంబంధించి మున్సిపల్‌ కమిషనర్‌, రూరల్‌ ప్రాంతానికి సంబంధించి తహసీల్దార్‌, జిల్లాకు సంబంధించి కలెక్టర్‌ నోడల్‌ ఆఫీసర్లుగా ఉంటారన్నారు. సమావేశంలో మున్సిపల్‌ కమిషనర్‌ రఘునాథరెడ్డి, ఎస్‌ఐ హైమావతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ, ఎంఈఓ సావిత్రమ్మ పోష్‌ చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ ఏఈ ఉమామహేశ్వరి, లేబర్‌ ఆఫీసర్‌ పావని తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి

మైదుకూరు : పని చేసే ప్రదేశంలో మహిళలకు రక్షణ కల్పించాలని ఎంపీడీఓ ఫజుల్‌ రహిమాన్‌ అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం -2013పై ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్‌ యాక్ట్‌ -2013)పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. పని చేసే ప్రదేశంలో మహిళలకు లైంగిక వేధింపుల నుండి సురక్షిత వాతావరణం ఉండాలని, దీనికి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలన్నారు. లైంగిక వేధింపులను నివారించడం, నిషేధించడం, పరిష్కారం చూపించడం ధ్యేయంగా భారత ప్రభుత్వం 2013 ఏప్రిల్‌ 23న పోష్‌ యాక్ట్‌ను తీసుకొచ్చిందన్నారు. లైంగిక వేధింపులను ఫిర్యాదు చేయడానికి ప్రతి కార్యాలయంలోనూ ఇంటర్నల్‌ కంప్లెయింట్‌ కమిటీని ఏర్పాటు చేస్తారని, వీటి ద్వారా మహిళలు న్యాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు ప్రశాంతి, ఓబులమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు.

కమిటీలు ఏర్పాటు చేయాలి

చాపాడు : మహిళల రక్షణ కోసం ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కమిటీలను ఏర్పాటు చేయాలని మండల అభివృద్ధి అధికారి రహంతుల్లయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో సోమవారం ఐసీడీఎస్‌ సీడీపీఓ సావిత్రమ్మ అధ్యర్యంలో ఫోస్‌ చట్టంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు రవిశంకర్‌, వంశీకృష్ణ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ జీఎంఎస్‌కేలు పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్‌ : పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంఈఓ సావిత్రమ్మకు ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌ మాణిక్య రాజు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న కొంత మంది విద్యార్థులకు ఇంకా పాఠ్యపుస్తకాలు అందలేదని, వెంటనే వారికి అందించాలన్నారు. విద్యా హక్కు, ఫీజు నియంత్రణ చట్టాలు పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ భాగ్‌ కన్వీనర్‌ శరణ్‌, నగర కార్యదర్శి శివ, సోహెల్‌, శ్రావణ్‌, వెంకటేష్‌, నితిన్‌ తదితరులు పాల్గొన్నారు.

కేసీ కాలువ నీటి విడుదలపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

ఖాజీపేట : శ్రీశైలం జాలశయానికి 875 అడుగుల నీటి మట్టం చేరుకున్నందున కేసీ కాలువకు నీటి విడుదలపై తక్షణమే ప్రభుత్వం అధికారిక ప్రకటన చేయాలని ఏపీఎస్‌ ఆర్టీసీ కడప జోన్‌ మాజీ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి దుంపలగట్టు గ్రామంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 841 అడుగులకు నీరు చేరగానే పోతిరెడ్డి పాడు ద్వారా నీటిని విడుదల చేయవచ్చునని అన్నారు. ప్రస్తుతం 875 అడుగులకు నీరు చేరిందన్నారు. జూరాల, తుంగభద్ర జలాశయం నుంచి శ్రీశైలంకు భారీగా వరద నీరు చేరుతోందన్నారు. నీటి విడుదల చేయడం వల్ల కేసీ కాలువకు నీరు వస్తుందన్నారు. ఖరీఫ్‌లో రైతులు సకాలంలో సాగుచేసుకునే వీలు కలుగుతుందన్నారు. దీని వల్ల రైతులకు చీడపీడల సమస్య తక్కువగా ఉంటుందన్నారు. పంటల దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉందన్నారు. అలాగే ఎస్‌ఆర్‌బీసీ 1,2లకు నీరు నింపాలన్నారు. ప్రభుత్వ పెద్దలు రైతులకు మేలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.